క్లుప్తంగా

సొంతంగా తాత్కాలిక రోడ్డు నిర్మాణం



తాత్కాలిక రోడ్డు నిర్మిస్తున్న దాతలు

కెరమెరి: మండలంలోని అనార్‌పల్లివాగుతో ప్రజలు ఇబ్బందులు దృష్ట్యా బీఆర్ఎస్ నాయకులు కెరమెరికి చెందిన శేక్ యూనూస్, జన్కాపూర్‌కు చెందిన రాథోడ్ రూప్‌లాల్ ఆదివారం సొంత ఖర్చుతో వాగుపై తాత్కాలిక మట్టి రోడ్డు నిర్మించారు. వాగులో 10పైపులు వేసి నీటి ప్రవాహం ఆగిపోయిన తర్వాత మట్టి, మొరం పోసి చిన్న వాహనాలు, పాదచారులు వెళ్లేందుకు అనువుగా రోడ్డు నిర్మించారు. ఇందుకు సుమారు రూ. 90వేలు వెచ్చించినట్లు వారు పేర్కొన్నారు.

'వ్యవసాయంలో మహిళా రైతుల పాత్ర కీలకం'



మహిళా రైతును సన్మానిస్తున్న ఏవో తిరుమలేశ్వర్

తిర్యాణి: వ్యవసాయంలో మహిళా రైతుల పాత్ర ఎంతో కీలకమని మండల వ్యవసాయ శాఖ అధికారి తిరుమలేశ్వర్ అన్నారు. ఆదివారం మహిళా కిసాన్ దినోత్సవం సందర్భంగా మండలంలోని పంగిడిమాదర రైతువేదికలో వేడుకలు నిర్వహించారు. కొన్నేళ్లుగా వ్యవసాయంలో రాణిస్తున్న మహిళా రైతులను పూలమాలలు, శాలువాలతో ఘనంగా సన్మానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మహిళల సహకారం లేనిదే వ్యవసాయంలో సంపూర్ణత సాధించలేమన్నారు. కార్యక్రమంలో ఏఈవో ముత్తయ్య తదితరులు ఉన్నారు.

దుర్గాదేవి విగ్రహాల తయారీ




విగ్రహాన్ని తయారు చేస్తున్న కళాకారుడు

చింతలమానెపల్లి: దసరా సందర్భంగా మండలంలో ఉత్సవాలను ఘనంగా నిర్వహించనున్నారు. దసరా ఉత్సవాల సందర్భంగా ఈజ్‌గాం, నజ్రుల్‌నగర్, రవీంద్రనగర్‌లలో ఉత్సవాలకు దుర్గాదేవి విగ్రహాలను తయారు చేస్తున్నారు. పర్యావరణ హితంగా మట్టితో విగ్రహాలను కళాకారులు తయారు చేస్తున్నారు. దసరా పండుగకు 5 రోజుల ముందు భక్తులు విగ్రహాలను ప్రతిష్ఠించనున్నారు.

నేడు బీజేపీ కార్యకర్తల సమావేశం

కాగజ్‌నగర్‌టౌన్: బీజేపీ సిర్పూర్ నియోజకవర్గం బూత్‌స్థాయి శక్తి కేంద్రాల సమ్మేళనాన్ని సోమవారం కాగజ్‌నగర్ పట్టణంలోని పటేల్ గార్డెన్‌లో నిర్వహిస్తున్నట్లు సిర్పూర్ తాలుకా కన్వీనర్ వీరభద్రాచారి ఒక ప్రకటనలో తెలిపారు. కార్యక్రమానికి ఆదిలాబాద్ ఎంపీ సోయం బాబురావు, జిల్లా ఎన్నికల ఇన్‌చార్జి, మహారాష్ట్ర వణి నియోజకవర్గ ఎమ్మెల్యే సంజీవ్ రెడ్డి ధొట్లే, జిల్లా అధ్యక్షుడు డాక్టర్ కొత్తపల్లి శ్రీనివాస్, జిల్లా ఇన్‌చార్జి పోశాం, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పాల్వాయి హరీశ్ బాబు, అమర్‌సింగ్ తిలావత్, తాలుకా ప్రభారి రాజమౌళి గౌడ్‌లు హాజరు కానున్నట్లు పేర్కొన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ



పరామర్శిస్తున్న ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్

బెజ్జూర్: మండల కేంద్రానికి చెందిన బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకుడు కోండ్ర జగ్గాగౌడ్ తల్లి రెండు రోజుల క్రితం అనారోగ్యంతో మృతిచెందగా బాధిత కుటుంబాన్ని బీఎస్పీ రాష్ట్ర చీఫ్, సిర్పూర్ ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ ఆదివారం పరామర్శించారు. ఆయన వెంట రాష్ట్ర కార్యనిర్వాహక కమిటీ కార్యదర్శి అర్షద్ హుస్సేన్, సూర్ల ఇస్తారి, నీలయ్య, సారయ్య, ఖాజా ఉన్నారు.

బ్రహ్మోత్సవాలు ప్రారంభం

ఆసిఫాబాద్: సిర్పూర్(టి) మండల కేంద్రంలోని శ్రీ బాలాజీ వేంకటేశ్వర ఆలయంలో ఆదివారం దసరా నవరాత్రి బ్రహ్మోత్సవాలు ప్రారంభమయ్యాయి. స్థానిక శ్రీ బాలాజీ వేంకటేశ్వర ఆలయంలో భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. ఈ నెల 15 నుంచి 23 వరకు ఉత్సవాలు నిర్వహించనున్నట్లు ఆలయ ప్రధాన అర్చకుడు గంగు సత్యనారాయణ శర్మ, హిందూ ఉత్సవ సమితి అధ్యక్షుడు రాపర్తి శ్రీకాంత్ తెలిపారు.

ప్రయాణం.. నరకప్రాయం

- రోడ్లన్నీ గుంతలమయం • ఇబ్బందులు పడుతున్న ప్రజలు

సిర్పూర్(టి) నియోజకవర్గంలోని రహదారులు అధ్వానంగా ఉండడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. నియోజకవర్గ కేంద్రం కాగజ్‌నగర్ నుంచి ఆయా మండలాలకు ఉన్న రహదారులు గుంతలమయం కాగా వంతెనలు శిథిలావస్థలో ఉన్నాయి. రహదారులు ఏళ్లుగా మరమ్మతులకు నోచుకోకపోవడంతో ప్రయాణాలు నరకప్రాయంగా మారాయి. నిధులు మంజూరైనా అటవీ అనుమతులు రాక నియోజకవర్గంలోని కొన్ని రోడ్లు ప్రారంభానికి నోచుకోలేదు.

– చింతలమానెపల్లి



దహెగాం మండలం గిరవెల్లి నుంచి ఖర్జికి వెళ్లే దారిలో గుంతలు

పెంచికల్‌పేట్ మండలంలో..



కోతకు గురైన పెంచికల్‌పేట్ -బెజ్జూర్ రహదారి

పెంచికల్‌పేట్ మండల కేంద్రం నుంచి దహెగాం మండలానికి రహదారి పనులు పూర్తి కాలేదు. పెంచికల్‌పేట్ నుంచి సలుగుపల్లి వరకు రహదారి గుంతలతో నిండిపోయింది. పెద్దవాగు వంతెన వద్ద రహదారి పనులు పూర్తయితే దహెగాం –పెంచికల్‌పేట్ మండలాల మధ్య రవాణా తిప్పలు తొలగిపోతాయి.

కాగజ్‌నగర్ మండలంలో..

నియోజకవర్గ కేంద్రం కాగజ్‌నగర్ నుంచి ఆయా మండలాలకు రహదారులు ఉండగా వీటిలో పెంచికల్‌పేట్, చింతలమానెపల్లి మండలం డబ్బా గ్రామం వరకు మాత్రమే రహదారులు మెరుగ్గా ఉన్నాయి. కాగజ్‌నగర్ నుంచి సిర్పూర్, కౌటాల, చింతలమానెపల్లి మార్గం నిత్యం రద్దీగా ఉంటుంది. ఈ మార్గంలో కాగజ్‌నగర్– సిర్పూర్ మధ్యలో ఉన్న రైల్వేగేటు వద్ద సుమారు కిలోమీటరు మేర రోడ్డు గుంతలమయంగా ఉంది. ఆయా మండల కేంద్రాల నుంచి కాగజ్‌నగర్ పట్టణానికి రవాణా మెరుగవ్వాల్సి ఉంది.

బెజ్జూర్ మండలంలో..

కాగజ్‌నగర్ నుంచి బెజ్జూర్ మండల కేంద్రానికి ఉన్న రెండు రహదారులు సలుగుపల్లి వరకు మాత్రమే పూర్తయ్యాయి. రెబ్బెన, కొత్తగూడెం గ్రామాల మధ్య ఉన్న రహదారితో వర్షాకాలంలో ప్రయాణికులు నరకం చూస్తున్నారు. ఏళ్లుగా కొనసాగుతున్న పనులు ప్రయాణికుల సహనాన్ని పరీక్షిస్తున్నాయి. మొగవెల్లి నుంచి గూడెం, బెజ్జూర్ నుంచి సోమిని గ్రామాల రహదారుల పనులకు 2018లోనే నిధులు మంజూరయ్యాయి. ఈ పనులకు అటవీ అనుమతులు రాకపోవడంతో నిలిచిపోయాయి. గూడెం వరకు రహదారి నిర్మాణం పూర్తయితే మండలంలో రవాణా పూర్తిస్థాయిలో మెరుగవుతుంది.

చింతలమానెపల్లి మండలంలో..



చింతలమానెపల్లి నుంచి మహారాష్ట్రకు వెళ్లే దారి దుస్థితి

చింతలమానెపల్లి మండల కేంద్రం నుంచి గూడెం మీదుగా మహారాష్ట్రకు వెళ్లే మార్గం గుంతలతో అధ్వానంగా మారింది. సుమారు 20కిలోమీటర్ల మేర ప్రయాణం నరకప్రాయంగా మారింది. గూడెం, కోయపెల్లి, బూరుగూడ, చిత్తాం, దిందా, ఖర్జెల్లి గ్రామాల ప్రజలు మండల కేంద్రానికి రావాలంటే గుంతల రోడ్లతో ఇబ్బందులు పడుతున్నారు. మండల కేంద్రం నుంచి బాబాసాగర్ మీదుగా డబ్బా క్రాస్‌రోడ్ వరకు సైతం ఇదే పరిస్థితి ఉంది.

సిర్పూర్(టి) మండలంలో..

నియోజకవర్గంలోని రెండు అంతర్రాష్ట్ర రహదారులు సిర్పూర్(టి) మండలం గుండా వెళ్తున్నాయి. మండల కేంద్రం నుంచి వెంకట్రావుపేట మీదుగా మహారాష్ట్రలోని గోండ్‌పిప్రి, ఆష్టి పట్టణాలకు, మండల కేంద్రం నుంచి హుడ్కిలి జక్కాపూర్ మీదుగా విరూర్, రాజూరా పట్టణాలకు రహదారులు ఉన్నాయి. నిత్యం కాగజ్‌నగర్, కౌటాల, సిర్పూర్ మండలాల నుంచి వందల సంఖ్యలో వాహనాలు ఆయా పట్టణాలకు రాకపోకలు సాగిస్తుంటాయి. మండలంలోని ప్రధాన రహదారి సహా అంతర్రాష్ట్ర రహదారులు అధ్వానంగా ఉండడంతో ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారు. భారీ వాహనాలతో రహదారులన్ని దెబ్బతిన్నాయి.



సిర్పూర్(టి) నుంచి మహారాష్ట్రకు వెళ్లే రహదారిపై గుంతలు

కౌటాల మండలంలో..



అధ్వానంగా తుమ్మిడి హెట్టి రహదారి

కొన్నేళ్లుగా మండల కేంద్రం నుంచి ఆయా గ్రామాలకు రహదారులు అధ్వానంగా ఉన్నాయి. ముత్తంపేట నుంచి పార్డి మీదుగా వీరవెల్లి, సాండ్‌గాం గ్రామాలకు మట్టి రహదారులు ఉన్నాయి. వర్షాకాలంలో ఈ మార్గంలో వెళ్లాలంటే విన్యాసాలు చేయాల్సిందే. మండల కేంద్రం నుంచి గుండాయిపేట మీదుగా తుమ్మిడి హేటి, మండల కేంద్రం నుంచి విజయనగరం మీదుగా గుడ్లబోరి గ్రామాలకు రహదారి గుంతలమయంగా మారింది.

దహెగాం మండలంలో..

కాగజ్‌నగర్ నుంచి దహెగాం మండలంలోని ఇట్యాల వరకు రహదారి ఉండగా అందెవెల్లి వద్ద వంతెన కూలిపోవడంతో గతంలో రాకపోకలు నిలిచిపోయాయి. ఇటీవల తాత్కాలిక వంతెన పనులు పూర్తి చేసి రాకపోకలు పునరుద్ధరించారు. పెద్ద వంతెన పనులు త్వరగా పూర్తి చేయాలని స్థానికులు కోరుతున్నారు. మండలంలోని గెర్రె వరకు, గిరవెల్లి నుంచి ఖర్జి వరకు, కల్వాడ నుంచి కొంచవెల్లి వరకు రహదారులు అధ్వానంగా ఉన్నాయి. గుంతల కారణంగా వర్షాకాలంలో బురదతో, మిగతా కాలాల్లో దుమ్ముతో ప్రయాణికులు తీవ్ర అవస్థలు పడుతున్నారు.



కొంచవెల్లి -కల్వాడ రహదారి దుస్థితి

బీఆర్ఎస్ నాయకుల సంబరాలు

బెజ్జూర్: సిర్పూర్ నియోజకవర్గ ఎమ్మెల్యే కోనేరు కోనప్పకు రాష్ట్ర ముఖ్యమంత్రి ఆదివారం బీఫామ్ అందజేయడంతో పాటు మెనిఫెస్టో విడుదల చేసిన సందర్భంగా బీఆర్ఎస్ నాయకులు సంబరాలు జరుపుకున్నారు. ఆదివారం మండల కేంద్రంలో బాణసంచాలు పేల్చి మిఠాయిలు తినిపించుకున్నారు. పార్టీ మండల అధ్యక్షుడు సకారాం, పీఏసీఎస్ చైర్మన్ ఓంప్రకాష్, పీఏసీఎస్ మాజీ వైస్‌చైర్మన్ ఇస్తారి, సర్పంచులు, ఎంపీటీసీలు నాయకులు పాల్గొన్నారు.

జిల్లాకేంద్రంలో..

ఆసిఫాబాద్: అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో ఆదివారం సీఎం కేసీఆర్ బీఆర్ఎస్ మెనిఫెస్టో విడుదల చేయడంతో పాటు బీఆర్ఎస్ బీఫాం కోవ లక్ష్మికి అందజేసిన సందర్భంగా జిల్లా కేంద్రంలోని అంబేడ్కర్ చౌక్ వద్ద పార్టీ ఆధ్వర్యంలో సంబరాలు జరుపుకున్నారు. అంతకు ముందు జెడ్పీ చైర్‌పర్సన్ కోవ లక్ష్మి నివాసం నుంచి ర్యాలీగా తరలి వచ్చారు. పార్టీ పట్టణ అధ్యక్షుడు అహ్మద్‌బిన్ అబ్దుల్లా, భీమేశ్, పార్టీ నాయకులు సయ్యద్ నిసార్, ఎండీ అహ్మద్, సీహెచ్ రవి, బలరాం నాయక్, సాయి శ్రవణ్, జాకీర్, ఇస్లాం, జావిద్, నజీర్ పాల్గొన్నారు.

రెబ్బెన: రాష్ట్రంలోని అన్ని వర్గాలను దృష్టిలో పెట్టుకొని సీఎం కేసీఆర్ ఎన్నికల మెనిఫెస్టో విడుదల చేశారని ఎంపీపీ జుమ్మిడి సౌందర్య, జెడ్పీటీసీ సంతోష్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు పోటు శ్రీధర్ రెడ్డిలు అన్నారు. ఆసిఫాబాద్ నియోజక వర్గ బీఆర్ఎస్ అభ్యర్థిగా కోవలక్ష్మికి పార్టీ బీఫాం అందజేయడంతో ఆదివారం మండల కేంద్రంలో బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు సంబరాలు చేసుకున్నారు. పీఏసీఎస్ చైర్మెన్ సంజీవ్‌కుమార్, సర్పంచులు, ఎంపీటీసీలు నాయకులు తదితరులు పాల్గొన్నారు.



ఆసిఫాబాద్: సంబరాల్లో బీఆర్ఎస్ శ్రేణులు

జైనూర్: అసెంబ్లీ ఎన్నికల్లో భాగంగా కేసీఆర్ ప్రకటించిన మెనిఫెస్టోతో బీఆర్ఎస్ గెలుపు ఖాయమని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ కనక యాదవరావు, పార్టీ మండల అధ్యక్షుడు ఇంతియాజ్‌లాలా అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా టపాకాయలు పేల్చి, మిఠాయిలు పంచుకున్నారు. వైస్‌ఎంపీపీ చిర్లే లక్ష్మణ్, ఎంపీటీసీల ఫోరం అధ్యక్షుడు భగవంత్‌రావు, నాయకులు డోంగ్రే సమాధాన్, సతీశ్, హైదర్, శంకర్, సర్పంచులు, ఉపసర్పంచులు, కార్యకర్తలు తదితరులు ఉన్నారు.

కౌటాల: బీఆర్ఎస్‌తోనే అభివృద్ధి సాధ్యమని ఆ పార్టీ మండలాధ్యక్షుడు ఆదే వసంత్‌రావు అన్నారు. ఆదివారం పార్టీ అధినేత కేసీఆర్ బీఆర్ఎస్ పార్టీ అసెంబ్లీ ఎన్నికల మెనిఫెస్టో విడుదల చేయడంతో పార్టీ నాయకులు మండల కేంద్రంలోని కుమురం భీం చౌరస్తాలో టపాకాసులు కాల్చి సంబరాలు చేసుకున్నారు. రైతుబంధు సమితి మండల కన్వీనర్ మెర్పల్లి బ్రహ్మయ్య, సర్పంచులు, నాయకులు పాల్గొన్నారు.

పెంచికల్‌పేట్: మండలంలోని చేడ్వాయి, కొండపల్లి గ్రామాల్లో బీఆర్ఎస్ మెనిఫెస్టో విడుదల చేసిన సందర్భంగా బీఆర్ఎస్ శ్రేణులు సంబరాలు జరుపుకున్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు, యువకులు, మహిళలు పాల్గొన్నారు.



రెబ్బెనలో..



కౌటాల: సంబరాల్లో పార్టీ నాయకులు

కాగజ్‌నగర్‌టౌన్: కేసీఆర్ బీమా పేదలకు ధీమా నిస్తుందని కాగజ్‌నగర్ మున్సిపల్ చైర్మన్ సద్దాం హుస్సేన్, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు వీవీ ప్రసాద్‌లు అన్నారు. సీఎం కేసీఆర్ ఎన్నికల మెనిఫెస్టో ప్రకటించిన సందర్భంగా ఆదివారం పట్టణంలోని రాజీవ్‌గాంధీ చౌరస్తాలో బాణా సంచాలు కాల్చి సంబరాలు చేసుకున్నారు. జిల్లా కోఆప్షన్ సభ్యులు సిద్దిక్, కౌన్సిలర్లు, బీఆర్ఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

కొలువుదీరిన దుర్గామాత

జిల్లాలో శరన్నవరాత్రులు ఆదివారం ప్రారంభమయ్యాయి. మండల కేంద్రాలతో పాటు ఆయా గ్రామాల్లోని మండపాల్లో దుర్గాదేవి విగ్రహాలను ప్రతిష్ఠించారు. వేదపండితుల మంత్రోచ్ఛరణలతో అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి నైవేద్యాలు సమర్పించారు. ఇందిరానగర్‌లోని కనకదుర్గాదేవి, స్వయంభూ మహంకాళి ఆలయంలో మొదటి రోజు అమ్మవారు బాల త్రిపుర సుందరీ దేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. మండపాల్లో మహిళలు, యువతులు పెద్ద ఎత్తున దుర్గామాతకు భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు.

-దహెగాం/ఆసిఫాబాద్‌రూరల్/ ఆసిఫాబాద్/ రెబ్బెన



జిల్లా కేంద్రంలోని పైకాజీనగర్‌లో కొలువుదీరిన శారదామాత



రెబ్బెన: బాల త్రిపుర సుందరీ దేవిగా దర్శనమిస్తున్న అమ్మవారు



జిల్లా కేంద్రంలోని శివకేశవ మందిర్‌లో కొలువుదీరిన శారదామాత



రెబ్బెన: అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు

ముమ్మరంగా వాహనాల తనిఖీ

దహెగాం: ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున నగదు, మద్యం అరికట్టడానికి ఎన్నికల కమిషన్ ప్రత్యేక చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా జిల్లాల సరిహద్దుల్లో చెక్‌పోస్టులు, ఫ్లయింగ్ స్క్వాడ్ ఏర్పాటు చేసింది. ఆదివారం ఫ్లయింగ్ స్క్వాడ్ రాజేశ్ ఆధ్వర్యంలో సిబ్బంది ఖర్జి, గిరవెల్లి మార్గాల్లో ముమ్మరంగా వాహనాల తనిఖీలు చేశారు. ఈసీ ఆదేశాల మేరకు వాహనాల తనిఖీలు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

ఆసిఫాబాద్‌రూరల్: ఎన్నికల ప్రవర్తనా నియమావళి ప్రతి ఒక్కరూ పాటించాలని సీఐ రాజు అన్నారు. ఆదివారం మండలంలోని బూర్గుడ హనుమన్ ఆలయం కూడలి వద్ద అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో వాహనాల తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ ఎన్నికల కోడ్ నేపథ్యంలో నగదు, మద్యంపై కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటున్నామన్నారు. కార్యక్రమంలో ఎస్సై మహేందర్, పోలీస్ సిబ్బంది ఉన్నారు.

నార్నూర్: ఎన్నికల నిబంధనలు అమల్లోకి రావడంతో నార్నూర్, గాదిగూడ మండలాల్లో ఎన్నికల ఫ్లయింగ్ స్క్వాడ్ టీంల బృందాలు తనిఖీలు ముమ్మరం చేశాయి. ఫ్లయింగ్ స్క్వాడ్ టీం సభ్యుడు అమృత్‌లాల్ ఆధ్వర్యంలో ఆదివారం నార్నూర్ మండలం హస్నాపూర్ చౌరస్తా, తాడిహత్నూర్, మాన్కాపూర్, నార్నూర్‌లో వాహనాలు తనిఖీ చేశారు. ఆర్టీసీ బస్సులను ఆపి వస్తువులు, బ్యాగులను పరిశీలించారు. గాదిగూడ మండలంలోని మేడిగూడ మహారాష్ట్ర సరిహద్దు వద్ద ప్రత్యేకంగా చెక్‌పోస్టు ఏర్పాటు చేశారు. లోకారి–కే చౌరస్తా వద్ద వాహనాలను క్షుణ్ణంగా తనిఖీ చేశారు.



వాహనాన్ని తనిఖీ చేస్తున్న ఫ్లయింగ్ స్క్వాడ్

ఆదివాసీల మెనిఫెస్టో ప్రకటించాలి

ఆదిలాబాద్‌రూరల్: అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న దృష్ట్యా ఆయా పార్టీలు ఆదివాసీల సంక్షేమానికి సంబంధించి మెనిఫెస్టో ప్రకటించాలని ఆదివాసీ భారత్ మహా సభ నాయకులు డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలో ఆదివారం నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశంలో వారు మాట్లాడారు.

కార్యకర్తలు సైనికుల్లా పనిచేయాలి



పార్టీలోకి ఆహ్వానిస్తున్న నాయకులు

ఆసిఫాబాద్‌అర్బన్: రానున్న ఎన్నికల్లో వైఎస్సార్‌టీపీ జెండా ఎగురవేసేందుకు నాయకులు, కార్యకర్తలు సైనికుల్లా పనిచేయాలని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు బుక్యా గోవింద్‌నాయక్ అన్నారు. జిల్లా కేంద్రంలో ఆదివారం నిర్వహించిన నియోజకవర్గస్థాయి సమావేశంలో ఆయన మాట్లాడారు. వివిధ పార్టీలకు చెందిన నాయకులు వైఎస్సార్‌టీపీలో చేరారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రజలు రాజన్న రాజ్యం కోసం ఎదురుచూస్తున్నారని పేర్కొన్నారు. బీఆర్ఎస్ రాష్ట్రాన్ని అప్పుల కుప్పగా మార్చిందని ఆరోపించారు. త్వరలో నియోజకవర్గంలో రెండు విడతలుగా పాదయాత్ర కొనసాగింపుపై చర్చించినట్లు తెలిపారు. కార్యక్రమంలో రియాజొద్దీన్, సుధాకర్, పెద్దపల్లి కిషన్‌రావు, నాగోరావు, అరుణ్, ఆనందీశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

సద్వినియోగం చేసుకోవాలి

కైలాస్‌నగర్: మైనార్టీ విద్యార్థులు కంప్యూటర్ శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని ఆదిలాబాద్ చారిటబుల్ ట్రస్ట్ అధ్యక్షుడు యూనీస్ అక్బాని కోరారు. ట్రస్ట్ ఆధ్వర్యంలో కంప్యూటర్ శిక్షణ కేంద్రాన్ని ఆదివారం ప్రారంభించారు.